# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

10 | నిజామాబాద్, బుధవారం 26 మార్చి 2025 | ADILABAD NIRMAL




మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో తీర్మానాలు

- 28న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పర్యటనను జయప్రదం చేయాలి
- మాజీ మంత్రి రామన్న

ఎదులాపురం, మార్చి 25 : సీసీఐ ఫ్యాక్టరీ పునః ప్రారంభించాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యంలో తీర్మానాలు చేశామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఈనెల 28న సీసీఐ పోరాటానికి మద్దతు ఇవ్వడానికి వస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. 1000 మందిని సమీకరించాలని, 200 బైక్‌లతో ర్యాలీ నిర్వహించాలని సూచించారు. అలాగే ఏప్రిల్ 2న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా 100 మందితో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఉదయం 9గంటల నుంచి 10:30 వరకు సీసీఐ పరిశ్రమ పరిశీలన, అక్కడి నుంచి బైక్ ర్యాలీ, 11:30బహిరంగ సభ ఉంటుందన్నారు. సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేశ్, కో-కన్వీనర్ విజ్జగిరి నారాయణ, కొండ రమేశ్, గణపతిరెడ్డి, లోకారి పోశెట్టి, రత్నపురం రమేశ్, అగ్గిమల్ల గణేశ్, సందీప్, జగన్, గణేశ్ పాల్గొన్నారు.

# పెరగని పింఛన్


## ఆశగా ఎదురు చూస్తున్న ఆసరా పింఛన్‌దారులు



- కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోవాలని అంటున్న లబ్ధిదారులు
- పెంపుపై ఎదురు చూస్తున్న 1,51,362 మంది
- కొత్త పింఛన్ల కోసం కూడా చూస్తున్న 20 వేల మంది..

నిర్మల్, మార్చి 25(నమస్తే తెలంగాణ) : ''అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లను పెంచుతాం.. వృద్ధులు, వితంతువులు తదితరులకు ఇచ్చే రూ.2,016ను రూ.4వేలు.. దివ్యాంగులకు ఇచ్చే రూ.4 వేలను రూ.6వేలకు పెంచుతాం..'' అని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా పేదలకు ఇచ్చిన హామీని ఏ మాత్రం నెరవేర్చడం లేదు. వారి మాటలు నమ్మి ఓటేసి గెలిపించినా పింఛన్లు ఎప్పుడు పెంచుతారోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. కాగా.. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 వేలకు పైగా లబ్ధిదారులు కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు పింఛన్ల పంపిణీలో కూడా జాప్యం జరుగుతున్నది. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లోని లబ్ధిదారులు ప్రతి నెల చివరి వరకు నిరీక్షించాల్సి వస్తున్నది. చాలామందికి ఫిబ్రవరి పింఛన్ డబ్బులు నేటికీ అందలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉదదో అర్థం చేసుకోవచ్చు. నిర్మల్ జిల్లాలో అన్ని రకాల పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు 1,51,362 మంది ఉండగా.. వీరికి ప్రతి నెల రూ.31.58 కోట్లు పంపిణీ చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం అందజేసిన దివ్యాంగులకు రూ.4వేలు, మిగతా వారికి రూ.2,016లనే నేటికీ కాంగ్రెస్ సర్కారు అందిస్తున్నది.









### రూ.4 వేలు ఇస్తమంటే ఓట్లేసినం..

పొద్దంత బీడీలు చేస్తే నెలకు 1500 అస్తలేవు. గవర్నమెంటు ఇచ్చే పింఛన్‌తోనే ఇల్లు ఖర్చులు ఎల్తున్నయ్. ఎలక్షన్ల కాంగ్రెస్ గెలిస్తే 4 వేల పింఛన్ చేస్తమంటే ఓట్లేసినం. ఇప్పుడు యాడాది దాటింది. పింఛన్ పైసలు పెంచుతమని చెప్పి పెంచకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. ఈ ప్రభుత్వం అచ్చినంక మా గురించి పట్టించుకునేటోళ్లే లేరు. కేసీఆర్ సారు ఉన్నప్పుడే మాకు పింఛన్ పెంచిండు. అప్పుడు నెలనెలా ఠంఛన్‌గా అస్తుండే. ఇప్పుడు ఒక నెల పైసలు లేటుగా అస్తున్నయ్. ఇప్పటికైనా బీడీ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను 4వేలకు పెంచాలి.

*-గుమ్మడి లక్ష్మీ, బీడీ కార్మికురాలు, పార్‌పెల్లి, లక్ష్మణచాంద మండలం.*

### ఎన్నికలప్పుడు బుద్ధి చెబుతం..

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 వేల పింఛన్ ఎప్పుడిస్తదో ఏమో అర్థం కావడం లేదు. ఎన్నికలప్పుడు పింఛన్ పెంచుతామని చెప్పి మాట తప్పుతున్నరు. ఇప్పటికీ కేసీఆర్ ఇచ్చిన 2 వేల పింఛనే అస్తున్నది. అప్పట్లో పింఛన్ టైంకు అస్తుండే. ఇప్పుడు అచ్చేదాక గ్యారెంటీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం దాటినా పింఛన్ పెంచడం గురించి ఒక్క మాట కూడా లేదు. మా ముసలోళ్లంటే ఇంత అలుసుతనమా. అన్ని అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారు. పింఛను పెంచకుంటే వచ్చే ఎన్నికలల్ల కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం.

*- ఉమ్మే దిగంబర్, వృద్ధాప్య పింఛన్‌దారు, మీర్జాపూర్, భైంసా మండలం.*

### కేసీఆరే మంచిగుండే..

నేను పుట్టిన సంది నడుము పడిపోయింది. రెండు కాళ్లు పని చేయవు. నేను బతుకేతందుకు పింఛనే ఆధారం. నాకు ఎవరూ లేరు. ముసలి తల్లితో కలిసి ఉంటున్న. తల్లే అన్ని మంచి చెడులు చూస్తది. యాడ గుంట భూమి లేదు. మా లాంటి కాళ్లు, చేతులు సక్కగ లేనోళ్లకు కేసీఆర్ సారు 4 వేల పింఛన్ ఇచ్చి దేవుడి లెక్క ఆదుకున్నడు. ఇప్పటికీ నెలకు 4 వేలు అస్తున్నయ్. ఆ పైసలతోనే పొట్ట గడుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే 6 వేల పింఛన్ ఇస్తరని చెప్పిన్రు. ఇప్పటి దాక అయితే రాలే. పాత పింఛనే అస్తున్నది.

*- కొత్తూరు పోషవ్వ, దివ్యాంగురాలు, పార్‌పెల్లి, లక్ష్మణచాంద మండలం*



ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి చెరువులో కొద్దిపాటు నీరు



# అడుగంటిన భూగర్భ జలాలు

- ఆదిలాబాద్ జిల్లాలో 8.02 మీటర్ల లోతులో నీటిమట్టం
- ఎండుతున్న చెరువులు, జలాశయాలు



తలమడుగు మండలం కజ్జర్లలో చెరువులో తక్కువగా ఉన్న నీరు

ఆదిలాబాద్, మార్చి 25(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు క్రమంగా పడిపోతున్నాయి. వేసవి ప్రారంభానికి ముందు నుంచే ఎండలు దంచి కొడుతుండడంతో నీటిమట్టం తగ్గుతున్నది. ఆదిలాబాద్ జిల్లాలో వానకాలంలో 1121.5 మీల్లి మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాకాలంలో కురిసిన వరద నీటితో చెరువులు నిండుకుండల్లా మారాయి. దీంతో వానకాలం పంటలకు సాగునీటి సమస్య లేకుండా పోయింది. సోయా, పత్తి, కంది దిగుబడులు బాగా వచ్చాయి. జిల్లాలో ఎండాకాలం ప్రారంభం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో ఎండల తీవ్రత అధికంగా ఉంది. నెల రోజుల నుంచి 36 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

#### పొంచి ఉన్న ముప్పు

ఆదిలాబాద్ జిల్లాలో వేసవి ప్రభావం ఈ ఏడాది అధికంగా ఉండడంతో సాగు, తాగునీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం నెలకున్నది. ఎండల తీవ్రత కారణంగా భూగర్భజలాలు గతంలో ఎన్నడూ లేని విధంగా పడిపోతున్నాయి. భూగర్భ జలమట్టం అక్టోబరులో 4.08 మీటర్ల లోతులో ఉండగా, నవంబరులో 5.14 మీటర్లు, డిసెంబరులో 6.06 మీటర్లు, జనవరిలో 7.08 మీటర్లు, ఫిబ్రవరిలో 8.02 మీటర్ల లోతుకు పడిపోయాయి. వానకాలంలో నిండుకుండలను తలపించిన చెరువుల్లో నీరు గణనీయంగా తగ్గిపోయింది. పెద్ద, మధ్య తరహా, చిన్న చెరువులు 482 ఉండగా చిన్న చెరువులు ఎండిపోగా, మధ్య తరహా చెరువుల్లో నీరు కొద్దిగా ఉంది. మరో 15 రోజుల్లో చెరువుల్లో ఈ నీరు కూడా ఉండదని స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం జొన్న పంటకు నీటి అవసరం ఉండగా భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీరు సరిగా రావడం లేదు. ఫలితంగా రైతులు పంటకు నీరు అందించడానికి ఇబ్బంది పడుతున్నారు. చెరువుల్లో నీరు తగ్గుతుండడంతో మూగజీవాలకు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.

## గాంధీజీ కనువిప్పు కలిగించూ..

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలుపరిచేట్టు చూడు
- విగ్రహానికి వినతిప్రతం సమర్పించిన ఆశ కార్యకర్తలు

*కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలాగా కనువిప్పు కలిగించాలని ఆశ కార్యకర్తలు నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. చలో హైదరాబాద్ వెళ్లిన వారిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. అత్యుత్సాహంతో అరెస్టు చేసిన పోలీసులు ఆశలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా కోశాధికారి రామలక్ష్మి, జిల్లా నాయకులు భాగ్యలక్ష్మి, మంగ, రాణి, సరోజ, సంగీత, లావణ్య, గంగలక్ష్మి, కృష్ణవేణి, శారద, పద్మ, అనురాధ, లక్ష్మి పాల్గొన్నారు.*

*- నిర్మల్ చైన్‌గేట్, మార్చి 25*



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

## ఏటీఎం కార్డు మార్చి.. రూ.40 వేలు విత్ డ్రా చేసి..

భైంసా, మార్చి 25 : భైంసా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఏటీఎంకు దేగాంకు చెందిన ఓ యువకుడు నగదు విత్ డ్రా చేసుకోవడానికి వచ్చాడు. డబ్బులు తీసుకుంటున్న క్రమంలో చింతల్‌బోరికి చెందిన జాదవ్ బాలాజీ డబ్బులు డ్రా చేసి ఇస్తానని చెప్పి అతని కార్డు తీసుకున్నాడు. కొద్ది సేపటికి డబ్బులు రావ డం లేదని, బ్యాంకులో అడగాలంటూ తన వద్ద ఉన్న కార్డు ఇ చ్చాడు. గమనించని ఆదర్శ్ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో రూ. 10 వేల చొప్పున రూ. 40 వేలు విత్‌డ్రా చేసినట్లు ఫోన్‌కు మెస్సేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే భైంసాకు చేరుకుని ఏటీఎం పరిసరాల్లో గాలించగా సదరు వ్యక్తి కనిపించాడు. నిలదీయగా పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. పోలీసులు అతని వద్ద తనిఖీ చేయగా ఏటీఎం కార్డు, జేబులో నగదు లభించాయి.



జామడలో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం ప్రతినిధులు

## కేంద్ర బృందం పర్యటన

నార్నూర్, మార్చి 25 : నార్నూర్ మండల కేంద్రంతోపాటు గుంజాల, జామాడ గ్రామాల్లో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి మంగళవారం కేంద్ర బృందం ప్రతినిధులు శుభోద్ కుమార్, రీతురాజ్ మిశ్రా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆయిల్ పాం తోటలను పరిశీలించారు. మౌలిక వసతులు, పాఠశాలల నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లల ఆరోగ్యం, వైద్యం తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా, మండల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీతి అయోగ్‌లో భాగంగా నార్నూర్ మండల అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌తోపాటు జిల్లా, మండల శాఖల అధికారులను అభినందించారు. ఇక్కడ డీఆర్డీవో రాథోడ్ రవీందర్, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రాథోడ్ రవీందర్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐటీడీఏ డీడీ అంబాజీ, ఐటీడీఏ ఏఈఈ తానాజీ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి పుల్లయ్య, డీఈవో ప్రణీత, తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో జవహర్‌లాల్, ఐసీడీఎస్ సీడీపీవో శారద ఉన్నారు.